## క్లుప్తంగా

### బసవేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

**కోసిగి:** మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర స్వామికి విశేష పూజలు చేపట్టారు. గురువారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేలాలు సమర్పించి పూజలు చేసుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### ఈరన్నస్వామి చెంతకు పాదయాత్ర


పాదయాత్రగా బయలుదేరుతున్న దృశ్యం

**పెద్దకడబూరు :** కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో వెలసిన మహిమాన్వితుడైన ఈరన్న స్వామి చెంతకు పెద్దకడబూరు మండల కేంద్రం నుంచి దాదాపు 800మందికి పైగా గురువారం పాదయాత్ర చేపట్టారు. వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్, ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు విజయేంద్రరెడ్డి, ప్రకాష్ శెట్టి ఆధ్వర్యంలో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో 40నుంచి 50మందితో మొదలైన ఈ పాదయాత్ర ఈ సంవత్సరం 800మందికి పైగా భక్తులు పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. పాదయాత్రగా బయలుదేరడం ఇది 5వ సంవత్సరం అన్నారు. భక్తులకు మధ్యలో అల్పాహారముతో పాటు మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా కల్పించినట్లు తెలిపారు.

### విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


ఎన్నికైన నూతన పట్టణ కమిటీ సభ్యులు

**ఆదోని సెంట్రల్:** విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనం నిర్మాణం చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. స్థానికంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆదోని పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా చరణ్ తేజ, పట్టణ కార్యదర్శిగా శశిధర్, పట్టణ ఉపాధ్యక్షులుగా సంజయ్, ఉత్తేజ్, పట్టణ సహాయ కార్యదర్శులుగా హేమంత్, ఉదయ్ కమిటీ సభ్యులుగా మరో పదిమందిని ఎనుకున్నారు.

### రైతులకు ఎరువుల పంపిణీ

**ఆదోని రూరల్:** మండలంలోని పెద్దతుంబలం గ్రామంలోని సొసైటీలో గురువారం రైతులకు డీఏపీ ఎరువులను సొసైటీ చైర్మన్ అన్వర్‌బాషా చేతులమీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఇఫ్కో కంపెనీకి చెందిన డీఏపీ 300 ఎరువు బ్యాగులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఈఓ రాజేష్, సొసైటీ మెంబర్లు బసన్న, శరణప్ప రైతులు పాల్గొన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**దేవనకొండ:** మండలంలోని బండపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఎక్సైజ్ సీఐ సువర్ణలత ఆధ్వర్యంలో ఎస్ఐలు సాయిప్రవీణ్, ప్రవీణ్ కుమార్ నాయక్.. సిబ్బందితో కలిసి దాడులు చేసి 5 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్, వెంకటేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అక్రమ మద్యం అమ్మినా, తరలించినా కేసులు తప్పవని సీఐ హెచ్చరించారు.

### హామీల అమలులో విఫలం

**ఆలూరు:** ఎన్నికలప్పుడు కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడయ్య విమర్శించారు. గురువారం సీపీఐ ఆలూరు మండల కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆగస్టు 9,10, 11వ తేదీల్లో నిర్వహించనున్న మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. గిడ్డయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆడబిడ్డ పథకాన్ని అమలు చేయలేమని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించడం దారుణమన్నారు. దీన్ని బట్టి చూస్తే వీరికి ప్రజలు, పాలనపై ఎంతవరకు ప్రేమ ఉందో తేలిపోయిందన్నారు.

# పశువైద్యశాల శిథిలం

- వర్షానికి ఒరుస్తున్న భవనం
- ఊడిపోతున్న పెచ్చులు
- మరమ్మతులకు నోచుకోని వైనం


ముగతిలో దెబ్బతిన్న పశువైద్యశాల భవనం


పైకప్పుకు సిమెంట్ పెచ్చులూడి ఇనుప కడ్డీలు తేలిన దృశ్యం

**నందవరం :** మండలంలోని పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. నాగలదిన్నె, ముగతి భవనాలు పూర్తిగా దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ముగతి గ్రామంలో ఉన్న పశువైద్యశాల భవనం పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు కనీసం మరమ్మతులకు నోచుకోవడంలేదు. పైకప్పు పెచ్చులూడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, వైద్య సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

**కారుతున్న పైకప్పు**

మండల పరిధిలోని ముగతి గ్రామంలో ఉన్న పశువైద్యశాల వర్షానికి ఒరుస్తోంది. పాతకాలపు భవనం కావడంతో గదులు అధ్వానస్థితికి చేరి పైకప్పు పెచ్చులూడి పడుతోంది. పాత భవనం కావడంతో సిమెంట్ పోయి పెచ్చులుడి భవనంపై నుంచి వాన నీరు కారుతోంది. దీంతో సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఇరుకుగా ఉన్న రెండు గదుల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన మందులు తడిపోతున్నాయి. అలాగే ఇంజెక్షన్లు ఉంచిన ఫ్రిడ్జ్‌లు కూడా తడిసి చెడిపోయే స్థితికి చేరాయి. సిమెంటు పెచ్చులూడి మొత్తం కడ్డీలన్నీ బయటకు తేలడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. చేసేది లేక శిథిలమైన భవనంలోనే అధికారులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పదుల సంఖ్యలో రైతులు వైద్యశాలకు వస్తుంటారు. మరమ్మతులు చేయించకపోతే పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోనళ చెదుతున్నారు.

**మరమ్మతులకు నివేదిక పంపాం**



మండలంలో పశు వైద్యశాలలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం నాగలదిన్నె, ముగతి భవనాలు పూర్తిగా శిథిలమై ఎపుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ప్రస్తుతం ముగతిలో శిథిలమైన భవనాలలోనే కాలం వెళ్లదీస్తున్నాం. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. కనీసం శిథిలైన భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. పాత భవనాలలోనే భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం.

– బెన్ని హేమంత్‌కుమార్, వెటర్నరీ డాక్టర్, ముగతి

## ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు. పల్లకోత్సవంలో కలశాలతో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

**పెద్దకడబూరు :** మండల కేంద్రంలోని చౌడేశ్వరి కాలనీలో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి వేడుకలను తొగటవీర క్షత్రీయ యూత్ ఆధ్వర్యంలో గురువారం సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఉదయం మేలుకొలుపు, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, అలంకరణ అనంతరం మంగళహారతులు ఇచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఆలయం నుంచి స్థానిక మల్లికార్జునస్వామి ఆలయం వరకు అమ్మవారి నామ సంకీర్తన చేస్తూ ఆనందోత్సావాలతో నృత్యం చేస్తూ, ఆడపడుచులు కలశాలతో వెంట నడుస్తూ అమ్మవారి పల్లకోత్సవం నిర్వహించారు. భజన, నృత్యాలతో జరిగిన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. వేడుకలలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి తదితరులు మొక్కులు తీర్చుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


ప్రత్యేక పూజలందుకున్న ఈరన్నస్వామి

**ఆదోని అర్బన్:** పట్టణంలో కొలువుదీరిన శ్రీ గంగా భవాని దేవాలయంలో అమావాస్య సందర్భంగా గురువారం గంగాధేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ముందుగా శివలింగానికి అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, ఆటో వెంకటేష్, మేఘనాథ్, వీరేష్, తాయప్ప, దీపక్‌బాబు, దుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**అన్నదానం**

**ఆదోని టౌన్:** అమావాస్య సందర్భంగా పట్టణంలోని మట్కారీగేరిలోని ఉరుకుంద ఈరన్నస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, ఆకుపూజలు జరిగాయి. తెల్లవారుజామునే స్వామివారికి జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం చేశారు.

## సమస్యలకు నిలయంగా బీసీ బాలికల హాస్టల్

**గోనెగండ్ల :** మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహం సమస్యలకు నిలయంగా మారిందని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి అన్నారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల బీసీ బాలికల వసతి గృహంలో ఉండే బాలికలు సమస్యలతో సతమత మావుతున్నారన్నారు. వసతి గృహంలో బాలికలకు కనీస సౌకర్యాలు లేవని, దీనిని వార్డెన్ కూడా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే వసతి గృహంలో మెనూ ప్రకారం బాలికలకు భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. వార్డెన్ తనకు ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళ్తున్నారని, వసతి గృహంలోని బాలికలకు ఏదైనా అత్యవసరమైతే పట్టించుకునే నాథుడే లేరన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సమీర్ బాషా, అన్సర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రం జాషువా వర్ధంతి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ మాట్లాడుతూ ఆ మహనీయుని రచనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సమసమాజ స్థాపన కోసం పద్య, కావ్యరూపాల్లో ఆయన ఎన్నో రచనలను రచించారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్, లోక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాదర్‌లింగ స్వామి దర్గాలో భక్తుల సందడి


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

**కౌతాళం:** మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. గురువారం స్వామి వారం కావడంతో పాటు అమావాస్య కలిసిరావడంతో భక్తులు అధికంగా తరలి వచ్చారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా తరలిరావడంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. దర్గాలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఇబ్బందులు తప్పాయి.

### సేవలను సమర్థవంతంగా అందించండి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**పెద్దకడబూరు :** ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సంబంధిత అంశాలపై కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూ వివాదాలు, పట్టాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పెండింగ్ కేసులు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. వేగవంతమైన పరిష్కారం కోసం తగు సూచనలు జారీ చేశారు. అధికారులు పారదర్శకతతో పని చేయాలని ఆదేశించారు.

### క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

**ఆదోని టౌన్:** క్షయవ్యాధి నిర్మూలనకై ప్రతిఒక్కరూ కృషి చేయాలని, దేశం నుంచి క్షయ వ్యాధిని పారదోలుదామని మెడికల్ ఆఫీసర్ త్రివేణి అన్నారు. గురువారం పట్టణంలోని 1వ వార్డు వాల్మీకినగర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు టీబీ నివారణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్వతి, సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, సుబ్బమ్మ బాయి తదితరులు పాల్గొన్నారు.


### నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

**ఆదోని అర్బన్:** పట్టణ శివారులోని రణమండల కొండల్లో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయ స్వామి క్షేత్రంలో శుక్రవారం నుంచి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మండల దీక్ష 41 రోజులపాటు భక్తులు ప్రతిరోజూ స్వామివారిని దర్శించుకుని దీక్ష చేపట్టనున్నారు. వేకువజాము నుంచి కార్తీకమాస నిత్య ప్రసాద సేవా సమితి సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకుడు టీజీ పాండురంగయ్యశెట్టి తెలిపారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి**

41 రోజులు మండల దీక్ష కోసం రణమండల కొండలో భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకుడు టీజీ పాండురంగయ్యశెట్టి తెలిపారు. భక్తులకు తాగునీటి, స్నానాలు వసతి కల్పించామన్నారు. శ్రావణమాసంలో 5 శనివారాలు వస్తాయని, ఐదో శనివారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రథోత్సవం ఉంటుందన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ


ఆశ్రమం నిర్వాహకుడు ఫిలిప్స్‌కు సరుకులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**ఆదోని అర్బన్:** పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఆస్పరి రోడ్డులోని జీవనజ్యోతి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాద్‌రావు, పట్టణాధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా, కోశాధికారి వనపరాజు, విశిష్ట సభ్యులు గోవిందరాజమూర్తి, ఓంప్రకాష్, నీలా మోహన్ వృద్ధాశ్రమానికి వెళ్లి బియ్యం ప్యాకెట్లు, సరుకులను అందించారు.

## యూరియా తిప్పలు


సినిమా టిక్కెట్ల కోసం కాదు యూరియా టోకన్ల కోసం రైతుల అవస్థలు


యూరియా కోసం పాసు పుస్తకాలను వరుసలో పెట్టి నిల్చొన్న రైతులు

**కౌతాళం:** యూరియా కొరత రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజూ మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేయడం పరిపాటిగా మారింది. ఈనెల 15వ తేదీన డబ్బు చెల్లించి టోకెన్లు తీసుకున్నా.. ఇప్పటికీ యూరియా అందక ప్రతిరోజూ జాగరణ చేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. గురువారం కూడా ఉదయం నుంచి రాత్రి రైతులు ఎదురు చూశారు. రాత్రి 8 గంటల సమయంలో సోమవారం వరకు యూరియా రాదని చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేకపోయింది. రైతు బందెన వాజ్ మాట్లాడుతూ ఏడు ఎకరాల పత్తి పొలం కోసం వారం పాటు తిరిగి టోకన్ రాయించుకున్నానని, 20బస్తాలకు రూ.5400 చెల్లించి వారం గడిచి పోయిందని, ప్రతి రోజూ కార్యాలయం చుట్టూ తిరగడమే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. మా కళ్ల ముందే బలమున్నోళ్లకు 40, 50 బస్తాలు ఇచ్చుకుంటూ పోతున్నారని, ప్రశ్నిస్తే దబాయిస్తున్నారని వాపోయాడు.

## మెనూ పాటించడం లేదని నిరసన


ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

**కోసిగి:** మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం పాటించడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ , విద్యార్థులు ఆరోపించారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గురువారం రోజున మెనూ పాటించకుండా కేవలం సాంబారు, అన్నం పెట్టి విద్యార్థుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. రాగి జావా, చిక్కీలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అలాగే ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు మాత్రం ఆఫీసుల్లో మినరల్ వాటర్ తాగుతుండే విద్యార్థులు మాత్రం బయట గుమ్మిలోని బోరునీటిని తాగుతున్నారన్నారు. ఉన్నత అధికారులు స్పందించి మోడల్ స్కూల్ తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘం మండల సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షుడు సంతోష్, గురుస్వామి, రవి, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

## నేరుగా వచ్చి పనులు చేసుకోవాలి


విచారణ చేపడుతున్న రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ క్రిష్ణవేణి, ఆర్టీఓ అధికారులు

**ఆదోని అర్బన్:** ఆర్టీఓ కార్యాలయంలో వాహనాలకు సంబంధించిన పనులు ఉంటే ఎవరి పనులు వారు నేరుగా కార్యాలయానికి వచ్చి చేసుకోవాలని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ క్రిష్ణవేణి, డీటీసీ శాంతకుమారి సూచించారు. ఈనెల 4వ తేదీన ఆర్టీఓ కార్యాలయ ఉద్యోగి మనోహర్, ఏజెంట్ అల్తాఫ్‌ల మధ్య జరిగిన ఘటనపై స్థానిక ఆర్టీఓ అధికారి నాగేంద్ర ఆధ్వర్యంలో విచారణ చేపట్టేందుకు రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ క్రిష్ణవేణి, డీటీసీ శాంతకుమారి స్థానిక ఆర్టీఓ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగి మనోహర్‌ను, ఏజెంట్ అల్తాఫ్ తదితరులను విచారణ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆర్టీఓ కార్యాలయంలో వాహనాలకు సంబంధించిన పని ఏదైనా ఉంటే ఎవరికి డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అలా అడిగితే ఆర్టీఓ, ఎంవీఐ అధికారులను సంప్రదించాలన్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. గతంలో మ్యానువల్ ఉండేదని, ప్రస్తుతం ఆన్‌లైన్ అయ్యిందన్నారు. ఏ పని అయినా సులభంగా, తొందరగా అవుతోందని, ఇందుకు వాహనదారులు సహకరించి రవాణాశాఖ ప్రతిష్టను పెంచాలని కోరారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే ఉద్యోగి మనోహర్‌కు సంబంధించిన వాటిని లాక్ చేసి, ఆయనను వేరేచోట కూర్చోబెట్టడం జరిగిందన్నారు. ముందుగా కమిషనర్, డీటీసీని ఎంవీఐ సిసిరాదీప్తి, ఏఎంవీఐ ఆవేజ్ శాలువా కప్పి సన్మానించి పూలబొకేలను అందజేశారు.

### తప్పిన ప్రమాదం

**హాలహర్వి:** స్థానిక బస్టాండు సమీపంలోని ఎస్సీ కాలనీలోని మొదటి రోడ్డులో అడ్డుగా గరుసు, సిమెంట్ పైపు ఉండడంతో ఓ లారీకి ప్రమాదం తప్పిందని కాలనీవాసులు తెలిపారు. ఆ రహదారిలో వచ్చిన లారీ గరుసుపై ఇరుక్కుపోయి ఓ పక్కకు ఒరిగింది. అయితే డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై ఉన్న పైపు, గరుసును తొలగించాలని కాలనీ వాసులు అధికారులను కోరారు. నేషనల్ హైవే కావడంతో ఈ మార్గంలో వాహనాలు అతివేగంగా వస్తున్నాయని, ప్రమాదాలు జరగకముందే వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

**కుప్పకూలిన సెంట్రింగ్**

**హాలహర్వి:** బల్లూరు గ్రామంలో బల్లూరేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణ మండపం అదనపు గదుల నిర్మాణానికి సంబంధించి గురువారం సాయంత్రం సెంట్రింగ్ వేసి ఆర్‌సీ వేస్తుండగా.. ఒక్కసారిగా సెంట్రింగ్ కుప్పకూలింది. కూలీలకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

### కోసిగి రోడ్డు బాగు చేయండి


ఆర్అండ్‌బీ డీఈకి వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

**ఎమ్మిగనూరుటౌన్:** పట్టణంలోని మార్కెట్ యార్డు నుంచి కోసిగి రోడ్డులో ఉన్న కమ్మలదిన్నె గ్రామం వరకు శిథిలమైన రోడ్డును బాగు చేయాలని ఉపాధ్యాయులు ఆర్అండ్‌బీ డీఈ నాగరాజును కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. యూటీఎఫ్ నాయకులు దావీదు, గుమ్మల బాబు, కొలన్న, యల్లప్ప మాట్లాడుతూ కోసిగి రోడ్డు పూర్తిగా శిథిలమైందని ఈ రహదారిపై ఉద్యోగ రిత్యా పాఠశాలలకు వెళ్లి వచ్చే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. గుంత రోడ్డుపై అడుగుకో గుంత ఉందని ఇటీవల కురుస్తున్న వర్షాలతో గోతుల్లో వర్షపు నీరు నిలబడి ద్విచక్రవాహనాలతో పాటు ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. దీంతో ఎమ్మిగనూరులోని కళాశాలలకు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలన పాటించేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. సత్వరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డీఈని కోరారు.

### ప్రశంసలు



ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ పి. రామాంజులు

**మంత్రాలయం రూరల్ :** మంత్రాలయం సీఐ రామాంజులు గురువారం కర్నూలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. మంత్రాలయం పుణ్యక్షేత్రం శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయం వెనుక భాగంలో తుంగభద్ర నదిలో ఈ నెల 18వ తేదీన మాధవరం గ్రామానికి చెందిన రచ్చుమర్రి కొపూరప్ప పడిపోగా కాపాడిన విషయం విధితమే. అందుకు గానూ సీఐకి ప్రశంసా పత్రం అందజేశారు. సీఐ మాట్లాడుతూ..రాఘవేంద్ర స్వామి సన్నిధిలో భక్తుల భద్రతను పటిష్టంగా నిర్వహిస్తామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తామని వివరించారు. అలాగే నది తీరం ప్రాంతాల్లో పోలీసుల బందోబస్తు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

**ట్రాఫిక్ ఏఎస్ఐకి..**


ప్రశంసా పత్రం అందుకుంటున్న ఆదోని ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్న

**ఆదోని రూరల్:** ఆదోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు వాహనదారులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించడంలో నైపుణ్యం ప్రదర్శించినందుకు గానూ ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్నకు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. గురువారం కర్నూలులో జరిగిన జిల్లా క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ చేతుల మీదుగా ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్నకు ప్రశంసా పత్రాన్ని అందిజేశారు. కార్యక్రమంలో ఆదోని డీఎస్పీ హేమలత ఉన్నారు.